క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: హనుమకొండలోని పలు ప్రాంతాల్లో ఈనెల 3న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు. హనుమకొండ హంటర్ రోడ్డులోని సిటిజన్ క్లబ్, భద్రకాళి బండ్, వాసవి కాలనీ, దుర్గాదేవి కాలనీ ప్రాంతాల్లో ఉదయం 8గంటల నుంచి 11గంటల వరకు, కిషన్పుర ప్రాంతంలో ఉదయం 8గంటల నుంచి 11గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

నేడు దొడ్డి కొమురయ్య జయంతి

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలో బీసీ సెల్, మహాత్మా జ్యోతిరావు పూలే సెంటర్ ఆధ్వర్యంలో ఈనెల 3న ఉదయం దొడ్డి కొమురయ్య 97వ జయంతిని నిర్వహించనున్నారు. ముఖ్యఅతిథిగా కేయూ వీసీ తాటికొండ రమేష్, రిజిస్ట్రార్ మల్లారెడ్డి పాల్గొంటారని బీసీ సెల్ డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాస్ తెలిపారు.

రేపు ఉచిత వైద్య శిబిరం

హన్మకొండ చౌరస్తా: ఈనెల 4వ తేదీన హనుమకొండ చౌరస్తాలోని జోయాలుక్కాస్ సమీపంలోని పద్మాక్షి పాలీ క్లినిక్లో ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు నిర్వాహకుడు రఘు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు నిర్వహించనున్న శిబిరంలో షుగర్, థైరాయిడ్, గుండె సంబంధిత వ్యాధులకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. 99559 96166, 91338 93360 నంబర్లకు కాల్చేసి పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జీవన్కు సన్మానం



కాజీపేట: వరంగల్ జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎన్నికైన తీగల జీవన్గౌడ్ను తెలంగాణ రైల్వే జేఏసీ చైర్మన్ కోండ్ర నర్సింగరావు, నాయకులు మంగళవారం సన్మానించారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో సభ్యులతో పాటు నాగపురి రాజయ్య పాల్గొన్నారు.

అంకితభావంతో పనిచేయాలి



కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలో హాస్టళ్ల జాయింట్ డైరెక్టర్లుగా నియమితులైన కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లు అంకితభావంతో పనిచేయాలని కాకతీయ యూనివర్సిటీ కాంట్రాక్టు లెక్చరర్ల అసోసియేషన్ (కుక్లా) అధ్యక్షుడు డాక్టర్ శ్రీధర్ కుమార్లోథ్ సూచించారు. జేడీలుగా నియమితులైన డాక్టర్ రాధిక, డాక్టర్ సూర్యనారాయణ, డాక్టర్ రాంచంద్రం, స్వప్న, లక్ష్మి, సత్య శివప్రసాద్ను కాకతీయ యూనివర్సిటీలోని ఇంజినీరింగ్ కళాశాలలో కాంట్రాక్టు అధ్యాపకుల సంఘం ఆధ్వర్యంలో మంగళవారం అభినందించారు. కార్యక్రమంలో కుక్లా బాధ్యులు అనిల్కుమార్, చీకటి శ్రీనివాస్, విజయ్కుమార్, కల్పన, ప్రసన్నరాణి, రమేష్, వాణి, లక్ష్మణ్నాయక్, మంజుల, రాజేష్రెడ్డి, కుమారస్వామి, వందన సిరి, సంతోష్, సౌజన్య, రేఖశ్రీ, రాజన్బాబు, భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సమయానికే మూసివేయాలి

వరంగల్ క్రైం: హనుమకొండ సబ్ డివిజన్ పరిధిలో మద్యం షాపులను నిర్ణీత సమయంలోపు మూసివేయాలని, లేకుంటే శాఖాపరమైన చర్యలు తప్పవని హనుమకొండ ఏసీపీ కొత్త దేవేందర్రెడ్డి హెచ్చరించారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున వైన్స్ షాపులు రాత్రి 10గంటలు, బార్ అండ్ రెస్టారెంట్లు రాత్రి 11గంటల లోపు మూసివేయాలని సూచించారు.

బస్సు ఢీకొని వ్యక్తి దుర్మరణం

వరంగల్ క్రైం: ఆర్టీసీ బస్సు ఢీకొట్టడంతో ఓ వ్యక్తి అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. ఈ ఘటన సోమవారం రాత్రి హనుమకొండ బస్టాండ్ ప్రాంగణంలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం కరీంనగర్ జిల్లా కేశవపట్నానికి చెందిన రామగిరి శ్రీనివాస్ (34) హనుమకొండ రాంనగర్లో ఉంటూ పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్నాడు. ఈక్రమంలో హైదరాబాద్కు వెళ్లి తిరిగి హనుమకొండకు సోమవారం రాత్రి వచ్చాడు. బస్టాండ్లో దిగి బయటకు వస్తున్న క్రమంలో ఆర్టీసీ బస్సు ఢీకొట్టడంతో రామగిరి శ్రీనివాస్ అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. బాధితుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హనుమకొండ ఇన్స్పెక్టర్ సతీష్ మంగళవారం తెలిపారు.

బెల్ట్షాపుపై దాడి

రామన్నపేట: ఇంతేజార్ గంజ్ పోలీస్స్టేషన్ పరిధిలో బెల్ట్షాపుపై టాస్క్ఫోర్స్ సిబ్బంది మంగళవారం దాడులు చేశారు. మద్యం విక్రయిస్తున్న కంచె రాజును అదుపులోకి తీసుకున్నట్లు టాస్క్ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ తెలిపారు. రూ.8,490 విలువగల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు.

ధీరత్వానికి ప్రతీక సర్వాయి పాపన్న



హన్మకొండ: నివాళులర్పిస్తున్న వినయ్భాస్కర్, సారయ్య, సుధీర్కుమార్, నాయకులు



పండ్లు పంపిణీ చేస్తున్న వెంకట నారాయణగౌడ్



హసన్పర్తి: నివాళులర్పిస్తున్న నాయకులు

హన్మకొండ: తెలంగాణ బహుజన ఆత్మగౌరవానికి, ధీరత్వానికి సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ ప్రతీక అని బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు, మాజీ చీఫ్ విప్ దాస్యం వినయ్భాస్కర్ అన్నారు. హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో సర్దార్ సర్వాయి పాపన్న వర్ధంతి కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ముందుగా పాపన్న చిత్రపటానికి దాస్యం వినయ్భాస్కర్, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, నాయకులు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం వినయ్భాస్కర్ మాట్లాడుతూ సబ్బండ వర్గాలకు రాజకీయ, సామాజిక సమానత్వం కోసం పాపన్న చేసిన కృషి చరిత్రలో నిలిచిపోతుందన్నారు. సర్వాయి పాపన్న జయంతి, వర్ధంతిని బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అధికారికంగా నిర్వహించిన విషయాన్ని గుర్తుచేశారు. జెడ్పీ చైర్మన్ డాక్టర్ సుధీర్ కుమార్, కుడా మాజీ చైర్మన్లు సుందర్రాజ్ యాదవ్, మర్రి యాదవరెడ్డి, నాయకులు లలితాయాదవ్, పులి రజినీకాంత్, నయీమొద్దీన్, జానకీ రాములు, సుహాస్, కోటేశ్వర్, సదాంత్, చందర్, సుగుణాకర్ రెడ్డి, ఖలీల్, పరశురాములు, వీరేందర్, రామ్మూర్తి, శ్రీధర్, రఘు, ఉపేందర్ పాల్గొన్నారు.

చిరస్మరణీయుడు

కాజీపేట: సబ్బండ జాతులను ఏకంచేసి రాజ్యాధికారాన్ని చేజిక్కించుకుని అమరుడైన సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ చిరస్మరణీయుడని రెడ్క్రాస్ సొసైటీ ఉపాధ్యక్షుడు పెద్ది వెంకట నారాయణగౌడ్ కొనియాడారు. పాపన్న 314వ వర్ధంతి సందర్భంగా కాజీపేట చౌరస్తాలో బాటసారులకు మంగళవారం పండ్లు పంపిణీ చేశారు. కల్లుగీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గౌని సాంబయ్య, బుర్ర శ్రీనివాస్, పల్లగాని అమ్మయ్య, ముంజ వెంకట్రాజం, బైరి ప్రభాకర్, మారగోని విజేందర్, బుంగని రాజేంద్రప్రసాద్, శ్రీరాములు పాల్గొన్నారు.

పాపన్నకు నివాళి

హసన్పర్తి: సర్దార్ సర్వాయి పాపన్న వర్ధంతిని హసన్పర్తి మండలం ముచ్చర్ల గ్రామంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పాపన్న విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు చిర్ర సుమన్, రమేష్, చిర్ర సాంబయ్య, రాజు, చల్లా వెంకటేశ్వర్రెడ్డి, సత్యం, రాజేందర్, చిరంజీవి పాల్గొన్నారు.

‘మాదిగలను మోసం చేసిన కాంగ్రెస్’



ఖిలా వరంగల్: అభివాదం చేస్తున్న నాయకులు

హన్మకొండ: మాదిగలకు వరంగల్ లోక్సభ స్థానం నుంచి అవకాశం కల్పించకుండా కాంగ్రెస్ మోసం చేసిందని ఎమ్మెస్పీ జాతీయ నాయకుడు మంద కుమార్ మాదిగ, ఎమ్మార్పీఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు గద్దల సుకుమార్ అన్నారు. మాదిగలకు కాంగ్రెస్ ద్రోహం చేసిందని, కడియం కావ్యకు టికెట్ ఇవ్వడాన్ని నిరసిస్తూ హనుమకొండలోని అంబేడ్కర్ విగ్రహం కూడలిలో ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ ఆధ్వర్యంలో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, సీఎం రేవంత్రెడ్డి దిష్టిబొమ్మలను మంగళవారం దహనం చేశారు.

కడియం శ్రీహరి దిష్టిబొమ్మ దహనం

కేయూ క్యాంపస్: ఎంపీ టికెట్ ఇవ్వకుండా దళితులకు కాంగ్రెస్ అన్యాయం చేసిందని ఆరోపిస్తూ కాకతీయ యూనివర్సిటీ మొదటి గేట్వద్ద అంబేడ్కర్ విద్యార్థి సమైక్య (ఏబీఎస్ఎఫ్)బహుజన స్టూడెంట్ ఫెడరేషన్ (బీఎస్ఎఫ్) ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కడియం శ్రీహరి దిష్టిబొమ్మను మంగళవారం దహనం చేశారు. ఈ సందర్భంగా ఏబీఎస్ఎఫ్ ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు మంద నరేష్, బీఎస్ఎఫ్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు బొట్ల మనోహర్ మాట్లాడుతూ ఉమ్మడి వరంగల్ జిల్లాలో దళిత జాతి నాయకులను ఎదగనీయకుండా అణగదొక్కిన ఏకైక వ్యక్తి కడియం శ్రీహరి అని అన్నారు.

కడియం కావ్యను ఓడిస్తాం..

ఖిలా వరంగల్: మాదిగ జాతికి తీవ్ర అన్యాయం చేసిన వరంగల్ కాంగ్రెస్ పార్లమెంట్ అభ్యర్థి కడియం కావ్యను ఎన్నికల్లో ఓడిస్తామని ఎంహెచ్డీ జిల్లా అధ్యక్షుగు గనిపాక ప్రదీప్ అన్నారు. చైతన్య యాత్రలో భాగంగా ఖిలా వరంగల్ మండలంలో మాదిగ హక్కుల దండోరా మండల అధ్యక్షుడు మైదం అశోకుడు అధ్యక్షతన మంగళవారం జరిగిన సమావేశంలో కొంగరి శంకర్, ప్రవీణ్, అరుణ్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

అణచివేస్తున్న ప్రభుత్వం

కాశిబుగ్గ: రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం మాదిగలను రాజకీయంగా అణచివేస్తోందని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జన్ను దినేష్, జిల్లా అధ్యక్షుడు కట్ల రాజశేఖర్ అన్నారు. సీఎం రేవంత్రెడ్డి, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, కడియం శ్రీహరి దిష్టిబొమ్మలను కాశిబుగ్గ జంక్షన్లో మంగళవారం దహనం చేశారు. కార్యక్రమంలో కోట రాజు, మల్లన్న, రాజు, మహేందర్, అనిల్, సంపత్, చంద్రశేఖర్, క్రాంతి తదితరులు ఉన్నారు.

సెంటిమెంట్తో మోసం చేశారు



హన్మకొండ చౌరస్తా: మాట్లాడుతున్న ఎమ్మెల్యే

హన్మకొండ చౌరస్తా: నీళ్లు, నిధులు, నియామకాల సెంటిమెంట్తో పదేళ్ల ప్రజలను బీఆర్ఎస్ పాలకులు మోసం చేశారని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి విమర్శించారు. హనుమకొండలోని అశోకా కన్వెన్షన్హాల్లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వరదల సమయంలో నగరం మునిగిపోతే ప్రజలను పరామర్శించి ఆర్థిక సాయం అందించలేని అసమర్థ బీఆర్ఎస్ నాయకులదని ధ్వజమెత్తారు. ఇప్పుడు పార్లమెంటు ఎన్నికలు సమీపిస్తుండడంతో బీజేపీ, బీఆర్ఎస్లు లోపాయికారీ ఒప్పందంతో కొత్త నాటకానికి తెరలేపారని అన్నారు. ఆరు గ్యారంటీలను పక్కాగా అమలు చేస్తున్న ఘనత రేవంత్రెడ్డి సర్కార్దే అని గుర్తుచేశారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు బత్తిని శ్రీనివాసరావు, కార్పొరేటర్లు తోట వెంకటేశ్వర్లు, పోతుల శ్రీమన్నారాయణ, జక్కుల రవీందర్, విజయశ్రీరజాలీ నాయకులు అంకూస్, లక్ష్మారెడ్డి, సరళ, విక్రమ్, సంపత్, సత్యనారాయణ, కార్తీక్, నేహాల్ తదితరులు పాల్గొన్నారు.

నాలా పనుల పరిశీలన

నయీంనగర్: నగరంలో చేపట్టిన అభివృద్ధి పనులను నాణ్యతతో నిర్ణీత కాలంలో పూర్తి చేయాలని అధికారులకు ఎమ్మెల్యే నాయిని రాజేందర్రెడ్డి సూచించారు. ఈమేరకు నయీంనగర్ బ్రిడ్జి పనులను మంగళవారం ఆయన పరిశీలించారు.

ఓటు హక్కు ప్రాధాన్యాన్ని ప్రజలకు వివరించాలి



వరంగల్ అర్బన్: ప్రజలకు ఓటు హక్కు ప్రాధాన్యాన్ని వివరించాలని బల్దియా అదనపు కమిషనర్ అనిసుర్ రషీద్ అన్నారు. లోక్సభ ఎన్నికలను పురస్కరించుకుని వరంగల్ తూర్పు నియోజకవర్గానికి సంబంధించిన స్వీప్ (సిస్టమాటిక్ ఓటర్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్ట్రికల్ పార్టిసిపేషన్) అవగాహన కార్యక్రమానికి మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు అనేది వజ్రాయుధం లాంటిదని, అలాంటి ఓటును ఎలాంటి ప్రలోభాలకు తలొగ్గకుండా స్వేచ్ఛగా వినియోగించుకోవాలని సూచించారు. నియోజకవర్గ నోడల్ అధికారి రాజేష్కుమార్, ఎస్ఈ ప్రవీణ్చంద్ర, సెక్రటరీ విజయలక్ష్మి, ఈఈలు శ్రీనివాస్, రాజయ్య పాల్గొన్నారు.

మినహాయింపు ఇవ్వాలి

విద్యారణ్యపురి: దీర్ఘకాలిక రోగాలు కలిగిన ఉన్న ఉద్యోగులు, ఉపాధ్యాయులు, గర్భిణులు, వికలాంగులు, ఉద్యోగ విరమణకు ఆరునెలల సమయం ఉన్న ఉపాధ్యాయులకు ఎన్నికల విధుల నుంచి మినహాయింపు ఇవ్వాలని టీఎస్యూటీఎఫ్ హనుమకొండ జిల్లా శాఖా బాధ్యులు కోరారు. ఈమేరకు కలెక్టర్ సిక్తా పట్నాయక్ను మంగళవారం కలిసి వినతిపత్రం అందజేశారు. టీఎస్యూటీఎఫ్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు సదాశివరెడ్డి, జనరల్ సెక్రటరీ పెండెం రాజు, బాధ్యులు పాల్గొన్నారు.

పౌష్టికాహార లోపంతోనే ఆటిజం



మాట్లాడుతున్న బండా రామలీల

హన్మకొండ చౌరస్తా: గర్భిణులు సరైన పౌష్టికాహారం తీసుకోకపోవడం వల్ల పుట్టే పిల్లల్లో ఆటిజం సమస్య తలెత్తుతుందని మల్లికాంబ మనోవికాస కేంద్రం నిర్వాహకురాలు బండా రామలీల వివరించారు. ప్రపంచ ఆటిజం అవగాహన దినోత్సవాన్ని పురస్కరించుకుని హనుమకొండ పబ్లిక్గార్డెన్లోని నేరెళ్ల వేణుమాధవ్ కళాప్రాంగణంలో నర్సింగ్, బీఈడీ కళాశాల విద్యార్థులకు మంగళవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రామలీల మాట్లాడుతూ ప్రస్తుత జనాభాలో 3శాతం మంది మానసిక దివ్యాంగతతో బాధపడుతన్నారని అన్నారు. వయస్సుకు తగ్గట్లుగా పిల్లల్లో రావాల్సిన మానసిక పరమైన ఎదుగుదల రాకుండా ఉండడమే ఆటిజం అని అన్నారు. ఆటిజం పిల్లలకు ప్రత్యేక కార్యక్రమాల ద్వారా శిక్షణ ఇస్తూ నైపుణ్యం పెంపొందించాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ సుదీప్, వసుధ, మల్లికాంబ సంస్థ బాధ్యులు కోడం కల్యాణ్, ప్రొఫెసర్ పద్మ, సదానందం, నర్సింగ్ విద్యార్థులు పాల్గొన్నారు.

రైలులో ఐదు సాధారణ బోగీలుండాలి



ఉత్తరాలను చూపుతున్న సంఘాల బాధ్యులు

కేయూ క్యాంపస్: ప్రతీరైలులో ఐదు సాధారణ బోగీలు ఉండేలా రైల్వేశాఖ చర్యలు తీసుకోవాలని సాధారణ బోగీల సాధన సమితి జాతీయ అధ్యక్షుడు పరికిపండ్ల అశోక్ డిమాండ్ చేశారు. ఈమేరకు ప్రధానమంత్రికి కోటి ఉత్తరాల ఉద్యమ కార్యక్రమాన్ని రిటైర్డ్ ఎంపీడీఓ విద్యాసాగర్ అధ్యక్షతన కాకతీయ యూనివర్సిటీలో మంగళవారం చేపట్టారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ ప్రయాణికుల భద్రత, సౌకర్యవంతమైన ప్రయాణానికి రైల్వేశాఖ చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో రిటైర్డ్ ప్రొఫెసర్ వేముల బాలసుందర్, పోలీస్ సబ్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్, వివిధ సంఘాల బాధ్యులు వేణుమాధవ్, పద్మ, మల్లారెడ్డి, ఈశ్వర్ప్రసాద్, గంగాధర చంద్రయ్య, కొమ్మునరేష్, బెడద నారాయణ, డిష్ శ్రీను, కొమ్మ అశోక్, కిషన్నాయక్, శ్రీనివాస్, వేణు, రామయ్య పాల్గొన్నారు.

వాల్మీకి బోయ సంక్షేమానికి ప్రాధాన్యం



కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న నాగరాజు

హసన్పర్తి: వాల్మీకి బోయ సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు అన్నారు. పెగడపల్లికి చెందిన వాల్మీకి బోయ సంఘం అధ్యక్షుడు కె.కొంరెల్లి, ప్రధాన కార్యదర్శి ముచ్చ రాజ్కుమార్, కార్యదర్శులు ముచ్చ ఐలయ్య, ఎర్ర రవీందర్తో పాటు కుల సంఘం సభ్యులు, మహిళలు.. స్థానిక కార్పొరేటర్ అరుణకుమారి ఆధ్వర్యంలో మంగళవారం కాంగ్రెస్లో చేరారు. ఈ సందర్భంగా వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఎమ్మెల్యే ఆహ్వానించారు. మాజీ సర్పంచ్ దేవరకొండ అనిల్ పాల్గొన్నారు.

కాలనీ అభివృద్ధికి సహకరించండి

మడికొండ: కాలనీ అభివృద్ధికి కృషి చేయాలని మడికొండలోని అయోధ్యపురం రోడ్డు టీఎన్జీఓఎస్ కాలనీవాసులు కోరారు. ఈమేరకు ఎమ్మెల్యే నాగరాజును హనుమకొండలోని తన నివాసంలో మంగళవారం మర్యాద పూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. బుర్ర శ్రీధర్, అనంత రాములు, సురేందర్, యాదగిరి, బేరింగ్ రమేష్, బైరి లింగమూర్తి, కుర్ల మోహన్, సభ్యులు పాల్గొన్నారు.

మానసిక ఉల్లాసానికి క్రీడలు దోహదం



క్రీడలను ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్ సౌజన్య

కేయూ క్యాంపస్: శారీరక దారుఢ్యానికి, మానసిక ఉల్లాసానికి క్రీడలు దోహద పడతాయని హనుమకొండలోని యూనివర్సిటీ మహిళా పీజీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సౌజన్య అన్నారు. కళాశాలలో వివిధ క్రీడాపోటీలను మంగళవారం ప్రారంభించి ఆమె మాట్లాడారు. చదువుతోపాటు క్రీడల పట్ల కూడా విద్యార్థినులు ఆసక్తి కనబర్చాలన్నారు. కబడ్డీ, ఖోఖో, చెస్, క్యారమ్, బ్యాడ్మింటన్, స్కిప్పింగ్, సాంస్కృతిక అంశాల్లో పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో అధ్యాపకులు రవీందర్, భాగ్యలక్ష్మి, మధుశ్రీ, కవిత, లలిత, కుమారస్వామి, నాగరాజు, గుగులోతు కవిత, జ్యోత్స్న, అన్నపూర్ణ, సుధీర్కుమార్, సుజాత, రాంమోహన్, సునీల్ పాల్గొన్నారు.

పదవీ విరమణ చేసిన ఉద్యోగికి సన్మానం



రామకృష్ణారావును సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు, సిబ్బంది

మడికొండ: మెట్టుగుట్ట దేవాలయంలో జూనియర్ అసిస్టెంట్గా విధులు నిర్వర్తిసూ పదవీ విరమణ చేసిన ఉద్యోగి కలవల రామకృష్ణారావును మంగళవారం సన్మానించారు. ఈ సందర్భంగా రామకృష్ణారావు దంపతులను ఆలయ ప్రాంగణంలో అభినందించారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వాహణాధికారి శేషుభారతి, ఆలయ చైర్మన్ పైడిపాల రఘుచందర్, అర్చకులు రాగిచేడు అభిలాష్శర్మ, పారుపల్లి సత్యనారాయణ శర్మ, విష్ణువర్ధనాచార్యులు, ధర్మకర్తలు బైరి రాజు, వస్కుల ఉమ, దండిగం శ్రీనివాస్, రొడ్డ దయాకర్, బోగి కేదారి, మాడిశెట్టి జ్ఞానేశ్వరి, స్థానికులు కుర్ల మోహన్, బైరి లింగమూర్తి ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలు



రామన్నపేట: వరంగల్ నగరంలోని మట్టెవాడలో వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలు మంగళవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా స్వామివారికి 25 కలశాలతో ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. ఉత్సవాల సందర్భంగా దేవాలయాన్ని సుందరంగా అలకరించారు. ప్రాతఃకాలం నుంచే వేద మంత్రోచ్ఛరణల మధ్య ప్రత్యేక పూజా కార్యక్రమాలతో ఆ ప్రాంతమంతా ప్రత్యేక శోభను సంతరించుకుంది. డాక్టర్ సోమ శ్రీధర్, నాగబండి దినేష్.. జ్యోతి ప్రజ్వలన చేసి ఉత్సవాలను ప్రారంభించారు. కార్యక్రమంలో వేద పండితులు శ్రీమాన్ రాఘవాచార్యులు, ఆరుట్ల రామాచార్యులు, కమిటీ అధ్యక్షుడు ఇరుకుళ్ల రమేష్, మాజీ కార్పొరేటర్ తోట నవీన్, పబ్బ విశ్వప్రసాద్, బెజగం రజినీకాంత్, వెంకటకృష్ణ, నాగేశ్వర్రావు పాల్గొన్నారు.

శీతలాష్టమి వేడుకలు



కాజీపేట: శీతలాష్టమి వేడుకలను పురస్కరించుకుని కాజీపేట స్వయంభు శ్వేతార్క మూలగణపతి దివ్య క్షేత్రంలో ఆలయ అర్చకులు అనేక మూలికలతో కూడిన నీటితో స్వామివారికి మంగళవారం అభిషేకం నిర్వహించారు. సహస్రధారలతో శ్వేతార్కుడికి అభిషేకం చేశారు. శీతలాదేవి, సూర్య భగవానుడికి విశేష మంత్రాలతో పూజలు జరిపించారు. భక్తులకు ఆలయ వైదిక కార్యక్రమాల నిర్వాహకులు అయినవోలు రాధాకృష్ణ శర్మ, సాయికృష్ణ శర్మ తీర్థ ప్రసాదాలు వితరణ చేసి ఆశీర్వచనం చేశారు.

సంక్షిప్తంగా

వెజిటేబుల్ ఫెస్ట్

హసన్పర్తి: హసన్పర్తి మండల కేంద్రంలోని సుజాత విద్యానికేతన్ పాఠశాలలో మంగళవారం వెజిటేబుల్ ఫెస్ట్ నిర్వహించారు. ఈ సందర్భంగా పలు రకాల ఆకుకూరలు, కూరగాయలు, పండ్లను ప్రదర్శించారు. అనంతరం వాటిని నగరంలోని లార్డ్, అతిథి అనాథాశ్రమాలకు అందించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఆకుతోట రాంబాబు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఉప ప్రధానోపాధ్యాయుడు లక్ష్మీనారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అరూరి రమేష్ గెలుపునకు కృషి చేయాలి

మడికొండ: రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ ఎంపీ అభ్యర్థి అరూరి రమేష్ గెలుపే లక్ష్యంగా ప్రతీ కార్యకర్త శక్తివంచన లేకుండా కృషి చేయాలని పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ సూచించారు. హనుమకొండలోని తన నివాసంలో ఆమెను గ్రేటర్ 46వ డివిజన్ ముఖ్య నాయకులు మంగళవారం కలిశారు. కార్యక్రమంలో నాయకులు పొనగోటి వెంకట్రావు, దళిత మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి గడ్డం మహేందర్, తక్కళ్లపల్లి నిఖిల్రావు, గడ్డం కుమార్, దార ధనుంజయ్, బుర్ర నరేష్, అజయ్, రాజేష్, అరవింద్ పాల్గొన్నారు.

శ్రీరామ నవమి ఆహ్వాన పత్రికల ఆవిష్కరణ

కాజీపేట: కాజీపేట 63వ డివిజన్ జూబ్లీ మార్కెట్ ఆవరణలోని దక్షిణముఖ అభయాంజనేయ స్వామి దేవాలయ ఆవరణలో వసంత నవరాత్రోత్సవ వేడుకల ఆహ్వాన పత్రికలను ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు మంగళవారం ఆవిష్కరించారు. ఈనెల 9నుంచి 17వ తేదీ వరకు ఆలయంలో జరగనున్న పూజా కార్యక్రమాల వివరాలతో కూడిన ఆహ్వాన పత్రికలను సభ్యులకు పంపిణీ చేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు జాగర్లపూడి శ్రీనివాస్ శర్మ, ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు అనగం యాదగిరి, మిట్టపల్లి రవిందర్, బి.రంజిత్ కుమార్, లక్ష్మణ్ కొల్హారియా, గంపా రమేష్ పాల్గొన్నారు.

ఓర్వలేకనే కాంగ్రెస్పై విమర్శలు

హన్మకొండ: కాంగ్రెస్ ప్రభుత్వానికి వస్తున్న ప్రజాదరణను చూసి ఓర్వలేకనే బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, ఆ పార్టీ నాయకులు అవాస్తవాలు మాట్లాడుతూ విమర్శిస్తున్నారని కాంగ్రెస్ సేవాదళ్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు నకిరేకంటి మోహన్ గౌడ్ తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వ అసమర్థత వల్లే కరువు వచ్చిందని అనడం హాస్యాస్పదంగా ఉందని ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పంట వాడిపోవడానికి, ఎండిపోవడానికి కూడా తేడా తెలియని పెద్ద రైతు కేసీఆర్ అని తెలిపారు.

కళల జాతర పోస్టర్ ఆవిష్కరణ



హన్మకొండ కల్చరల్: ఈనెల 7న వరంగల్లోని గోపాలస్వామి గుడి తోటమైదానంలో జేబీ కల్చర్ ఆర్ట్స్ సొసైటీ ఆధ్వర్యంలో శ్రీక్రోధి నామ సంవత్సర ఉగాది పురస్కారాల ప్రదానం, కళల జాతర కార్యక్రమం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈమేరకు కళల జాతర పోస్టర్లను ఓల్డ్ సిటీ క్యాంప్ కార్యాలయంలో మంత్రి కొండా సురేఖ మంగళవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్ జడల శివ, హరిత, గొండ శ్రీనివాస్, సిటీ మహిళా అధ్యక్షురాలు నారగోని స్వప్న, టీపీసీసీ కార్యదర్శి మీసాల ప్రకాష్, పద్మ పాల్గొన్నారు.

ఎస్ఆర్ఆర్తోటలో హోమం

ఖిలా వరంగల్: బొడ్రాయి ప్రతిష్ఠాపన మహోత్సవం సందర్భంగా వరంగల్ ఎస్ఆర్ఆర్తోటలో ఉత్సవ కమిటీ ప్రతినిధుల ఆధ్వర్యంలో యాగశాల ప్రవేశం, గణపతి హోమం మంగళవారం నిర్వహించారు.

సదస్సుకు హాజరు కావాలని ఆహ్వానం



ఆహ్వాన పత్రిక అందిస్తున్న కమిటీ ప్రతినిధులు

హన్మకొండ / హన్మకొండ చౌరస్తా: ఈనెల 6న హనుమకొండలోని అంబేడ్కర్ భవన్లో జరగనున్న సమాచార హక్కు చట్టం ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి అవగాహన సదస్సుకు హాజరు కావాలని కోరారు. ఈమేరకు రాష్ట్ర అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖను సమాచార హక్కు చట్టం పరిరక్షణ కమిటీ ప్రతినిధులు హనుమకొండలో మంగళవారం కలిసి ఆహ్వాన పత్రికను అందించారు. కార్యక్రమంలో సమాచార హక్కు చట్టం పరిరక్షణ కమిటీ జాతీయ ఉపాధ్యక్షుడు ఆంజనేయులు, ప్రతినిధులు నూర స్రవంతి, నమిండ్ల కార్తీక్, అఖిల్, అరవింద్, దేవేందర్ పాల్గొన్నారు.

సీతారాముల కల్యాణానికి రండి

కాశిబుగ్గ: 19వ డివిజన్ కాశిబుగ్గ ఓసిటీ రోడ్డులోని సీతారామాంజనేయ సహిత హరిహరపుత్ర అయ్యప్పస్వామి దేవాలయంలో ఈనెల 17న జరగనున్న సీతారాముల కల్యాణానికి రావాలని ఆలయ కమిటీ సభ్యులు కోరారు. ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖతో కలిసి ఆహ్వాన పత్రికలను ఆవిష్కరించారు. కూచన ఏకాంబ్రం, కూచన రవిందర్, మీసాల ప్రకాష్ తదితరులు ఉన్నారు.

బహిరంగ ప్రకటన

ఇందుమూలముగా సమస్త జనులకు తెలియచేయునది ఏమనగా నా క్లయింటులగు గడ్డం సంపత్ కుమార్, తండ్రి:కనకయ్య, నివాసం: ఇ.నెం. 26-7-64/3, ... K. Vidyasagar Rao గారితో S.A.G.P.A No. 6534/2017 Dt. 22-07-2017 ద్వారా సర్వే నెం. 257, ... 158.88 ... Link Deed No. 11512/2007 ... 2826/2011 తేది: 18-04-2011 ... Original ... SHO-Mattewada Police Station FIR No. 140/2018 ... S.A.G.P.A No. 6534/2017 Dt. 22-07-2017 ... SAGPA ...

Sd/- M.A. VIVEK ANAND, B.Com, LL.B
Advocate
H.No. 11-6-181/1, Christian Colony, Warangal.
Dt: 2-4-2024 Cell: 9866455647

కొనసాగుతున్న స్వర్ణోత్సవాలు



రామన్నపేట: వరంగల్ ములుగురోడ్డులో లాల్బహదూర్ కళాశాలను స్థాపించి 50 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా స్వర్ణోత్సవాలను నిర్వహిస్తున్నారు. వేడుకల్లో భాగంగా యూనివర్సిటీ స్థాయి క్రీడా పోటీలను మంగళవారం నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అరుణ డీహెచ్.రావు తెలిపారు. అలాగే, డ్యాన్స్, మ్యూజిక్ విభాగాల్లో గ్రూపు పోటీలు నిర్వహించినట్లు సాంస్కృతిక విభాగం కన్వీనర్ కొత్తపల్లి సుధాకర్ తెలిపారు. అనంతరం విజేతలకు ప్రిన్సిపాల్ డాక్టర్ అరుణ, వైస్ ప్రిన్సిపాల్ భుజేందర్రెడ్డి బహుమతులు ప్రదానం చేశారు.